# తేనీరు

అమ్మతోడు!

భగవంతుని సాక్షిగా చెబుతున్నా! నామాట నమ్మండి. 'టీ' అన్న ఇంగ్లీషు మాటను 'తేనీరు' అని అనువదించిందెవరో నాకు తెలీదు. అసలా ఇంగ్లీషు మాటకు 'తేనీరు' అన్న అనువాదం, సరయిందో కాదో కూడా నాకు తెలీదు.

అయితే---

'తేనీరు' అన్నమాటను నేను వినడం ఇదే మొదటి సారి కూడా కాదు. ఎప్పుడెప్పుడు విన్నానో, ఎక్కడెక్కడ విన్నానో తమకిప్పుడు మనవి చేసు కొంటున్నాను - వినండి!

నా చిన్నప్పటి సంగతిది -

అప్పటికి నాకు పదేళ్ళో, పన్నెండేళ్ళో - గుర్తు లేదు. ఏవో సెలవు లొచ్చాయి. తాతగారింటికొచ్చాను. అప్పుడప్పుడే లోకం లోకి కళ్ళు తెరుస్తున్నాను. తర - తమ - భేదాలు కొద్ది కొద్దిగా, అకళింపు కొస్తున్నాయి. ఆ గర్భ శ్రీమంతులకూ, ఆగర్భ దరిద్రులకూ మధ్య తేడాలున్నాయని, కొ్త్త కొ్త్తగా తెలుస్తూ తెలుస్తూ ఉంది. నా ఎదురింటివారబ్బాయి, ఫుల్ పాంట్ వేసుకొంటే, నాకు సగం షరాయిని, మా అమ్మ కుట్టించడం, గుడ్డ ఖరీదు భరించలేకనే - అని - అప్పుడు నాకు తెలీదు. నాతో బాటు

సగం పరాయిలూ, పావు పరాయిలూ తొడుక్కున్న వారూ ఉండేవారు. అసలే పరాయీ లేకుండా, మరికి గోచీ పెట్టుకొని తిరిగే వారూ, చాలామంది ఉండే వారు. ఎందుకలా ఉండేవారో నన్న ప్రశ్న, నా కప్పుడు కలగలేదు. ఒకవేళ కలిగే ఉంటే - నేను - ఏ సమాధానం చెప్పుకొని ఉండేవాణ్ణో ఇప్పుడు ఊహించడం కూడా నాకు సాధ్యం కాదు.

మా తాత గారి ఊరొచ్చానని చెప్పాను గదూ? అప్పుడు - నాకు పదేళ్ళో, పన్నెండేళ్ళో కూడా సరిగ్గా గుర్తు లేదని సైతం చెప్పాను గదూ?

మాదేమో ఐదు దూలాల పెంకుటిల్లు. వెనక పెరడు - కాస్తే ఉండేది గానీ, ముందు - బాగా, ఖాళీ జాగా ఉండేది. ఓ పెద్ద రాతి రోలు, దాని వొంచనే మునగ చెట్టూ, ఆ చెట్టుకు, అల్లంత దూరంలో గిలకల బావి - మీరు నమ్మండి! ఆ వీధి మొత్తం మీద, సొంత బావి ఉన్న వాళ్ళం మేమే! ఆ వీధి వారందరూ, మా బావి నించే నీరు తోడుకు పోతూ ఉండే వారు. కందెన తగ్గినప్పుడల్లా - ఆ దిక్కుమాలిన ఇనప గిలక - కీచు మంటూ గోలకెత్తేది. కాస్సేపు దాని గోలను విని, ఆనందించి, ఎక్కణ్ణించి, ఆ శబ్దం వొస్తుందో - పసిగట్టుకొని చూసి-అమ్మో, నాన్నో కోప్పడ్డాక, ఆ గిలక మొఖాన ఇంత నూనె పోసి, దాని గోల తగ్గించి, ఇవతలికొచ్చెయ్యడం నాకింకా గుర్తున్నది.

ఇంతకీ చెప్పొచ్చిందేమిటంటే - మా తాతగారింట్లో బావి లేదు. ఆ ఇంటికి అయిదారిళ్ళవతలినించి, మాతాత కావిడితో నీళ్ళు తెచ్చి పోస్తుండే వాడు. ఆయన గారు, ఏ కూలిపనికో, నాలిపనికో వెళ్ళినప్పుడు మా అమ్మమ్మ గారు నీళ్ళు తెస్తూ ఉండేది.

ఆవిణ్ని మీరెరగరు. ఎప్పుడన్నా చూపెడదామన్నా - ఆవిడ ఫొటో లేదు. ఆవిడ పచ్చగా ఉండేది. పచ్చిపసుపుకొమ్ము రంగులో ఉండేది. పొట్టిగా ఉండేది. జుట్టు చిరాగ్గా ఉంగరాలు తిరిగి ఉండేది. కాళ్ళగ్గానీ, చేతులగ్గానీ, ఏ సొమ్ములూ లేవు. ఆవిడ మెళ్ళో తాలిబొట్టు చూసిన గుర్తుకూడా నాకు లేదు. ఎప్పుడూ - ఓ పసుపుకొమ్ము మాత్రం వేళ్ళాడుతూ ఉండేది. ఎప్పుడూ చిరిగిన చీరెలో, మాసికలేసిన చీరెలో కట్టుకొంటూ ఉండేది. బక్కగా ఉండేది. రవంత వొంగిపోయి ఉండేది. అతి కష్టం మీద అడుగుతీసి అడుగువేస్తూ ఉండేది. ఎముకల మీద చర్మం ముసుగేసినట్టుగా ఉండేది.

నేనంటే సుబ్బమ్మవ్వకు వల్లమాలిన ప్రేమ. నడిచేప్పుడు కూడా నా మీంచి చెయ్యి తీసేది కాదు. అవసరమున్నా లేక పోయినా, నాకు జుత్తు సవరిస్తూ ఉండేది. అవసరమున్నా లేక పోయినా, నాకు చెమట తుడుస్తూ ఉండేది. అవసరమున్నా లేక పోయినా, నా చొక్కాను ముందుకూ, వెనక్కూ సర్దుతూ ఉండేది.

"నామనవడే తిరపతమ్మా! మా పెద్దమ్మాయి కొడుకు. నిన్ననే వచ్చాడు. ఎన్నో తరగతోనమ్మా - చదువుకొంటున్నాడు. ఒరేయ్ నాయనా! ఒక పజ్జం చదవరా?" అనేది సుబ్బమ్మవ్వ నాకేసి గర్వంగా చూస్తూ.

నా కొచ్చిన పజ్జాలేవో దంచి పారేసేవాణ్ణి.

ఊరేమో చిన్నది! బొడ్డురాయి కవతల పది కొంపలు కూడా ఉండవు. ఆ చెరువు కట్టమీద రావిచెట్లూ, జువ్విచెట్లూ ఎప్పుడూ గలగల్లాడుతూ ఉండేవి. కింద పడ్డ రావి ఆకుల్ని వొడుపుగా మడిచి, బూరలు చేసిస్తూండేది సుబ్బమ్మవ్వ. 'గయ్

గయ్' మని, చెవులు దిబ్బళ్ళు పడేలాగా ఊత్తూ ఊత్తూ, నేనూ- నా చేత ఊదిస్తూ ఊదిస్తూ సుబ్బమ్మవ్వ, ఆపూట పది గడపలైనా ఎక్కి దిగి ఉంటాం. నన్ను వాకిట్లోనే ఉంచి, సుబ్బమ్మవ్వ, ఇంటావిడతో, ఏదో గుసగుస లాడేది. తరువాత, బిక్కచచ్చిన ముఖంతో నాచేయి పుచ్చుకొని, మరో ఇంటి గడప ఎక్కేది.

ఆఖరికి నాకు తెలిసిందేమిటంటే - నేనొచ్చాను గనక - ఆపూట 'ఆబువ్వ' వొండిపెడదామని సుబ్బమ్మవ్వ ఉద్దేశమూ - అని! ఏ సజ్జన్నమో, జొన్నన్నమో కావాలంటే - తనకి బదవలే అవసరం లేదట. తను వెళ్ళిన, ఆ పది ఇళ్ళ దగ్గర తప్ప - ఇంకెక్కడా - బియ్యపు గింజలు దొరకవట. అందుకనే - తను తిరిగిందట.

"తిరపతమ్మ గారి వసారాలో, బియ్యం నేను చూశాగదా? తీసుకు రాకపోయావా అమ్మమ్మా?" అన్నాను.

అమ్మమ్మ ఇంకోసారి నా జుత్తు సర్ది "తే నీరు బాబూ!" అన్నది మెల్లగా, తనలో తను గొణుక్కుంటున్నట్లుగా.

"తే నీరు" అన్న మాటను - అదుగో - అప్పుడూ - నేను తొలిసారిగా విన్నది. అక్కడేమో, అన్ని బియ్యం కుప్పగా ఉండె - ఇక్కడేమో, చారెడు బియ్యం అవసరమూ ఉండె - ఈ అవసరానికి, ఆ చారెడు బియ్యమూ, విందుకు తేనీరో - ఇప్పుడు నాకు తెలుసుగానీ, అప్పుడు తెలీదు.

అది ఎండాకాలమూ! పడమటి శాంబరం, ఈ చెవిలోంచి, ఆ చెవిలోకి ఈడ్చి కొడుతోంది. కొమ్మ కదలడం లేదు. రెమ్మ

మెదలడం లేదు. శిరస్సు నుంచి చిరుపాదం దాకా - ఒకటే చెమట - దిగచెమట.

దానికి తోడు - సుబ్బమ్మవ్వ, పొయి నిండా కంది మోళ్ళు కుక్కింది. పొయిమీద కుండా, కుండలో సజ్జకుడుములూను. పొయికి అటూ ఇటూ పొంత కుండలు. కంది మోళ్ళ సెగకు, కుడుములూ ఉడకాలె, పొంతకుండల్లో నీళ్లూ కాగాలె! ఆ సాయంత్రం నాకు తలంటి పోస్తానంది సుబ్బమ్మవ్వ. అందుకని, నిన్ననే డొంకలకెళ్ళి; వొడినిండా - తంగెడుపుగింజలు తీసుకొచ్చాం. రాత్రె వాటిని నానేసింది. ఉదయం మజ్జిగ బోసి మెత్తగా రుబ్బింది. ఇదిగో - ఈ సజ్జ కుడుముల వాయి దించేశాక - స్నానం చేయిస్తానంది.

సరిగ్గా ఆ సమయంలో వచ్చాడు మాతాత ఆపసోపాలు పడుతూ. వస్తూనే, వసారా గుంజకు వారగిల బడ్డాడు. పడుతూనే, 'అసేయ్' అని నీరసంగా కేకేశాడు.

సుబ్బమ్మవ్వ - మసి చేతిని - అసలే మసిగా ఉన్న చీరెకు పులుముకొంటూ ఆదరాబాదరా వచ్చింది.

"తే - నీరు" అన్నాడు తాతయ్య నీరసంగానూ, ఆపురావురు మంటూనూ!

తాతయ్య భుజం మీది ఖాళీ ఉత్తరీయాన్ని చూసి - కళ్ళొత్తుకొంటూ, మంచినీళ్ళిచ్చింది సుబ్బమ్మవ్వ.

'తే - నీరు' అన్న మాటను, నేను రెండో సారి విన్న సందర్భం అదీ!

ఇదే మాటను నేను మూడో సారి విన్నది - సుమారుగా నాలుగైదేళ్ళ కిందట.

సీమ చింత పల్లెను మీరు చూశారో లేదో గానీ, నేను చూశా. ఆ ఊరికి అల్లంత దూరంలో కొండలున్నాయి. వాటిని తేమ గుట్టలంటారు. ఆ గుట్టల్లో మధ్యనించి, ఓ ఊట వాగు — ఊరికి ఎడంగా, పొలాల మధ్యగా పారుతూ ఉంటుంది. ఆ కాలం, ఈ కాలం అనకుండా, ఆ వాగులో ఎప్పుడూ నీరుంటుంది. ఎండాకాలమైతే అడుగున - సన్నజాలుగా పారుతుంది, వర్షా కాలమయితే - ఇహ దాని పొగరు చెప్పనక్కర్లేదు. కొండలమీది వాన నీరంతా, ఆ వాగులోకే చేరి, వరదగా మారి, పొలాల్ని జలమయం చేసేస్తుందది. అయిదారు ఊళ్ళు కూడా మునిగి పోతాయి. వరద తీసిందాకా - జనమంతా - గుట్టలమీదనే కాపరం.

అవునా?

ఎండాకాలం వచ్చిందనుకోండి! అయినా - వాగులో అంతో ఇంతో నీరుంటుందనుకోండి! అయినా - వాగుకు, అటుపక్కా, ఇటుపక్కా ఉన్న పొలాలన్నీ, నెర్రెలిచ్చి పోవలసిందే! దాహంతో అపురావురు మనవలసిందే! విత్తనాలు పొట్లి పోవలసిందే! జనం - 'కేగర్లో' మంటూ పొట్ట చేతబట్టుకొని, వలస పోవలసిందే!

ఇందులో ఉన్న తిరకాసేమిటో నాకు తెలీక వారినడిగాను గదా -

"ఎవర్రా, ఏవర్రా! మీకు పిచ్చా, చపల చిత్తమా? ఇంతకద్దు మాంచి — నీటి వనరు మీకుందిగదా? అనువైన స్థలమేదో చూసుకొని, ఈ వాగుకు అడ్డుకట్ట వేసుకోరాదా? నీటిని కొండల

మధ్య నిలవచేసుకోరాందా? అప్పుడు వరద బెడదా ఉండదు - నీటికొరతా ఉండదు. ఆ నిలవనీటిని చక్కగా — మీ పొలాలకు తెచ్చుకొనవచ్చునే!" అన్నాను.

"అలా తేనీరు బాబుగారూ!" అన్నారాయన.

"ఎంచేత?" అని నే నడక్కుండానే ఆయన అసలు సంగతి కాస్తా చెప్పుకొచ్చారు.

నిలవ నీటిలో, ఏవూరివారు - ఎంతవాటా వాడుకోవాలన్న సమస్య చాలా సంవత్సరాలదాకా తెగలేదుట. చచ్చీ చెడీ - ఒక సర్దుబాటు కొచ్చే సరికి ఇంకో మిత్తవ వొచ్చిపడింది! అక్కడెక్కడో ఓ ఫాక్టరీ కడుతున్నారట! ఈ నీరంతా దానికే కావాలిట. అంచాత ఒక్క నీటి బొట్టునుగూడా, ఈ పొలాలకు ఫాక్టరీ వారు 'తేనీరు'ట!

అయ్యో!

నేను మూడో సారి 'తే నీరు' అన్న మాటను విన్నదీ -

అదిగో - అప్పుడు!

—0—